క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: విద్యుత్ లైన్ల మరమ్మతు, చెట్ల కొమ్మలు తొలగింపు పనులు చేపట్టనున్న నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏడీఈ రమేష్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7గంటల నుంచి 10గంటల వరకు గద్వాల మండలంలోని 33/11కేవీ వీరాపురం, బీరెల్లి, పూడూరు, ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి, కేటీదొడ్డి మండలంలోని పాతపాలెం, ధరూరు మండలంలోని ద్యాగదొడ్డి, ఉప్పేరు సబ్‌స్టేషన్లకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అలంపూర్: విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అలంపూర్ సబ్ డివిజనల్ ఏడీఈ మహ్మద్ చిన్న మక్బుల్ బాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33కేవీ అలంపూర్ టౌన్ ఫీడర్ పరిధిలో ఒరిగిన విద్యుత్ స్తంభాలను సరి చేయడం, మిడిల్ పోల్స్ ఎత్తే పనులు, విద్యుత్ లైన్‌లకు తాకే చెట్ల కొమ్మలను తొలగించే పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. దీంతో 33/11కేవీ భీమవరం సబ్ స్టేషన్ పరిధిలోని భీమవరం, క్యాతూర్, ఉట్కూరు, లింగనవాయి గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సెట్‌లో ప్రతిభ


రఘువర్ధన్

గద్వాల అర్బన్: ఇటీవల విడుదలైన ఈసెట్ ఫలితాల్లో గద్వాల పట్టణానికి చెందిన విద్యార్థి ప్రతిభ కనబరిచాడు. జిల్లా కేంద్రంలోని తెలుగుపేట కాలనీకి చెందిన రఘువర్ధన్ ఈ-సెట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంకు సాధించాడు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలో రఘువర్ధన్‌ను పలువురు శాలువాతో సన్మానించి అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పోటీ పరీక్షల్లో రాణించి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకోరావాలని ఆకాంక్షించారు.

నేటి నుంచి మారెమ్మ, సవారమ్మ జాతర


కేటీదొడ్డి: మండలంలోని మైలగడ్డ, నందిన్నె గ్రామాల్లో మారెమ్మ, సవారమ్మ జాతర బుధవారం నుంచి ప్రారంభం కానున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ నెల 22న అమ్మవారికి బోనాలు ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఉత్సవాలు విజయవంతం చేయండి



అయిజ: అల్లిపీర సాహెబ్ స్వామి ఉర్సు ఉత్సవాలు విజయవంతం చేయాలని దర్గా ట్రస్ట్ సభ్యులు శివరాం ప్రసాద్ కోరారు. మంగళవారం పట్టణంలోని అల్లి పీరా స్వాముల ఆశ్రమంలో అల్లిపీర సాహెబ్ భక్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా ట్రస్ట్ సభ్యులు శివరాం ప్రసాద్ మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎమ్మిగనూరు మండలం గుడికల్ గ్రామంలో ఈనెల 23న గంధ మహోత్సవం, 24న ఉర్సు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

షిల్టు ఎత్తివేత



శాంతినగర్: వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్ 9వ వార్డులో షిల్టు ఎత్తివేసే కార్యక్రమాన్ని మున్సిపల్ సిబ్బంది మంగళవారం చేపట్టారు. శ్రీకృష్ణ చైతన్య పాఠశాల నుంచి వాల్మీకి ఆలయం వరకు ఏర్పాటు చేసిన ప్రధాన డ్రైయినేజీ కాల్వలో పేరుకుపోయిన షిల్టును జేసీబీతో ఎత్తిపోశారు. దీంతో వర్షపునీరు, మురుగు కాల్వల్లో నిల్వ ఉండకుండా ముందుకు వెళ్తుందని, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి

రాజోళి: రైతుల పాలిట వెన్నంటి ఉండేది కేవలం కాంగ్రెస్ పార్టేనని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులు సుభిక్షంగా ఉంటారని ఎంపీపీ మరియమ్మ అన్నారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు పండించిన వరికి రూ.500 అదనంగా ఇచ్చి కొనుగోలు చేస్తానని ప్రకటించడంతో రైతుల్లో నూతన ఉత్సాహం నెలకొందన్నారు. కార్యక్రమంలో నతానియేల్, వెంకటేశ్వర్లు, నాగేష్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూలి చెల్లింపులో జాప్యం

- మూడు వారాల డబ్బులు పెండింగ్
- ఇబ్బందులు పడుతున్న ఉపాధి కూలీలు


మానవపాడులో ఉపాధిహామీ పనులు పరిశీలిస్తున్న అధికారులు

మానవపాడు: మహాత్మాగాంధీ ఉపాధిహామీ పథకం పనులు చేసిన కూలీలకు మూడు వారాలుగా డబ్బులు రావడం లేదు. వారం వారం చెల్లించాల్సి ఉండగా, కొందరివి మూడు, మరికొందరికి రెండు వారాలుగా రావడం లేదని ఉపాధికూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2023 సంవత్సరానికి సంబంధించి వర్షాకాలంలో సరైన వర్షాపాతం లేక రైతులకు, కూలీలకు ఆశించిన స్థాయిలో పంటలు రాక, వ్యవసాయ పనులు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మానవపాడు మండలంలో 16 గ్రామ పంచాయతీలు ఉండగా, మొత్తం జాబ్ కార్డులు 9,958 గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద 2850 మంది పనులు చేస్తున్నారు. మండలాల వారీగా ఉపాధిహామీ పనులు కొనసాగుతున్నాయి. వ్యవసాయ పనులు పెద్దగా లేకపోవడంతో పెద్ద సంఖ్యలో కూలీలు ఉపాధి పనికి వెళ్తున్నారు. సాధారణంగా ఉపాధి కూలీలకు ప్రతి వారం డబ్బులు వస్తాయి. ఎప్పుడైనా ఆలస్యమైతే కనీసం రెండు వారాల్లో డబ్బులు అందుతాయి. ప్రస్తుతం సంవత్సరం గడిచినా డబ్బులు రాలేదని ఉపాధి కూలీలు వాపోతున్నారు. ఒక్కో కూలీకి సగటున 3 వారాలుగా డబ్బులు అందలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి పనులు చేయాలని అధికారులు చెబుతున్నా.. అమౌంట్ చెల్లింపులో ప్రభుత్వం నిర్లక్ష్యం వాహిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పని ప్రదేశంలో వసతులు లేవు

ఉపాధిహామీ పనిచేసే ప్రదేశంలో కనీస వసతులు కరువయ్యాయి. ఇటీవల ఎండలు తీవ్రంగా ఉండటంతో కూలీలు అస్వస్థకు గురవుతున్నారు. వేసవిలో మార్చి నుంచి జూన్ వరకు కూలీలకు వడదెబ్బ తగలకుండా నీడకోసం టెంట్లు వేసి రక్షణ కల్పించాల్సి ఉంటుంది. అలసట వచ్చినప్పుడు చెట్లపొదలు, చెట్ల నీడన సేద తీర్చుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రభుత్వం ఆయా గ్రామాలలో పని చేస్తున్న ఉపాధి కూలీలకు సరైన సదుపాయాలు కల్పించడంలో విఫలమైంది.

మూడు వారాల డబ్బులు రాలే..



కరువు పని డబ్బులు ఇదివరకు వారం వారం వచ్చేవి. ఇప్పుడు మూడు వారాల డబ్బులు రావాల్సి ఉంది. ఇప్పుడు వ్యవసాయ పనులు లేక, పంటలు సరిగా లేక రైతులు తీవ్ర నష్టపోయారు. ఈ కరువు కాలం డబ్బులు అడిగినా ఎవరూ ఇచ్చే పరిస్థితి లేదు. ఆర్థికంగా ఇబ్బంది అవుతోంది. అధికారులు స్పందించి మూడు వారాల డబ్బులు ఇప్పించాలి.

– నాగరాజు, ఉపాధి కూలీ, చెన్నిపాడు

పని ప్రదేశంలో వసతులు కల్పించాలి



ఉపాధి పని చేసే చోట కనీస వసతులు కల్పించడం లేదు. ఎండలకు తీవ్ర ఇబ్బందులు పడుతూ పని చేస్తున్నాం. కనీసం నీడ ఏర్పాటు చేయకపోవడంతో చెట్ల కింద సేద తీరాల్సి వస్తోంది. వడదెబ్బకు గురైతే వెంటనే మెడికల్ కిట్లు ఇచ్చే వారే లేరు. గతంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వసతులు ఇప్పుడు మచ్చుకైన కనిపించడం లేదు. వారం వారం కూలి డబ్బులు రాక ఇబ్బందులు పడుతూ పనికి వస్తున్నాం. అధికారులు స్పందించి సమస్యలు తీర్చాలి.

– వెంకటేశ్వర్లు, ఉపాధి కూలీ, చెన్నిపాడు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..

మండలంలోని వివిధ గ్రామాలకు వచ్చిన సామగ్రిని క్షేత్రస్థాయిలో ఉపయోగిస్తున్నారో లేదో, పరిశీలిస్తాం. ఉపాధి కూలీల సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. మెడికల్ కిట్లకు సంబంధించి ఆయా గ్రామాల్లో ఆశా వర్కర్లు ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ అందజేయాలని ఆదేశాలిచ్చాం. రెండు, మూడు వారాలకు సంబంధించిన పెండింగ్ బిల్లులు అందిచేలా చర్యలు తీసుకుంటాం.

– విజయ్‌శంకర్, ఏపీఓ, మానవపాడు

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి


రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


ఎర్రవల్లిలో చౌరస్తాలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

గద్వాల అర్బన్: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, కాంగ్రెస్ నాయకులతో కలిసి రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ దేశానికి దిశానిర్దేశం చేసిన చూపిన మార్గదర్శకుడన్నారు. భారతదేశానికి పునాదులు వేసి అణగారిన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, నాయకులు మధుసూదన్ బాబు, వెంకట్రామిరెడ్డి, ఇసాక్, జనార్దన్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కిఫాయత్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ నాయకులతో కలిసి కూడలిలో రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, నర్సింహ, తిమ్మారెడ్డి, అల్లబకాష్, కార్యకర్తలు ఉన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



అయిజ: మండలంలోని వేణిసోంపురంలోని ఆలయంలో మంగళవారం లక్ష్మీనరసింహ స్వామి జయంతి సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు శాస్త్రోక్తంగా వేద మంత్రాలు పటిస్తూ అభిషేకాలు చేశారు. లక్ష్మీ నరసింహ స్వామి రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. స్వామి వారి నామస్మరణతో ఆలయం పరిసరాలు మార్మోగాయి. రథోత్సవానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

క్రీడా ప్రాంగణాలు ఎంపీడీఓ తనిఖీ



మానవపాడు: మండలంలోని మద్దూరు, కలుకుంట్ల, పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడు, అమరవాయి గ్రామాల్లో మంగళవారం ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి క్రీడా ప్రాంగణాలను, వైకుంఠదామం, నర్సరీ, సెగ్రిగేషన్‌షెడ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు క్రీడా ప్రాంగణాలను యువతకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. సెగ్రిగేషన్‌షెడ్లలో తడి,పొడి చెత్తలను వేరుచేయాలని సూచించారు. నర్సరీలలో మొక్కలను హరితహారం నాటికి సిద్ధం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న డీపీఎంఓ మల్లికార్జున్

మానవపాడు: కుష్టువ్యాధి ఒక సామాన్యమైన వ్యాధిని, చర్మంపై గోధుమవర్ణంలో మొద్దుబారిన మచ్చలు వస్తాయని, ఇవి గుర్తించిన వెంటనే ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో చికిత్స తీసుకోవాలని డీపీఎంఓ మల్లికార్జున్, డాక్టర్ రిజ్వానా తాన్విర్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎస్ఎమ్‌లు,, ఆశలతో లెప్రసీపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామాలలో లెప్రసీ సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఏఎన్‌మ్‌లు, ఆశలు ఇంటింటికి వెళ్లి లెప్రసీ వ్యాధి గురించి అడిగి తెలుసుకోవాలన్నారు. ప్రారంభ దశలో గుర్తించి, మందులు 6నెలల నుంచి 12నెలలు పూర్తిగా వాడితే అంగవైకల్యాన్ని అరికట్టవచ్చని తెలిపారు. కుష్టు, క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సత్యనారాయణ, చంద్రన్న, సంధ్య, ఫార్మాసిస్ట్ తిరుమల్‌రావు, ఏఎస్ఎమ్‌లు, ఆశలు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు లోతు దుక్కులపై అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని చాగాపురం రైతు వేదికలో మంగళవారం వ్యవసాయ విస్తరణ అధికారి భరత్‌సింహ ఆధ్వర్యంలో లోతు దుక్కులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఈఓ మాట్లాడుతూ రైతులు రబీ పంటలు కోయగానే పొలాన్ని అలాగే వదిలేసి తొలకరి జల్లులు కురిసిన తర్వాత ఖరీఫ్ కోసం దుక్కులు దున్నడం మొదలుపెడతారని, దీనివల్ల దిగుబడి రాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. వేసవిలోనే లోతు దుక్కులు దున్నుకోవడం వల్ల రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. వేసవిలో లోతు దుక్కులు దున్నడం వల్ల భూమిలో తేమ నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. లోతుగా దున్నడం వల్ల లోతైన పొరల నుంచి నీరు ఆవిరి కాకుండా ఉంటుందన్నారు. భూమిపై పడిన ప్రతి వర్షపు బిందువు అక్కడికక్కడే ఇంకి నీరు పరిరక్షించబడుతుందని తెలిపారు. వర్షాధార పంటలు కీలక దశల్లో బెట్టకు గురైనప్పుడు లేదా తక్కువ వర్షపాతం నమోదైనప్పుడు పంట వేర్లు లోపలికి పోవడం వల్ల నేల లోపలి పొరల్లోని తేమను, పోషకాలను గ్రహించి బెట్టను తట్టుకునే శక్తిని చేకూరుతుందన్నారు. భూమి లోపలి పొరల్లోని మట్టి పైకి, భూమి పైమట్టి లోపలి పొరల్లోకి కలిసి పోవడం ద్వారా భూసారం సమానంగా మొక్కలకు అందడంతో అధిగ దిగుబడి వస్తుందన్నారు. ప్రతి రైతు వేసవిలో దుక్కులు దున్నాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, రైతులు, తదితరులు ఉన్నారు.

విద్యుత్ తీగలపై చెట్లకొమ్మల తొలగింపు


బీ తిమ్మాపూర్ శివారులో చెట్ల కొమ్మలు తొలగించిన జూనియర్ లైన్‌మెన్‌లు

అయిజ: విద్యుత్ తీగలను అల్లుకున్న చెట్ల కొమ్మలను తొలగించే కార్యక్రమాన్ని విద్యుత్ అధికారులు మంగళవారం పూర్తి చేశారు. అయిజ మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ నుంచి గట్టు మండలానికి ఏర్పాటు చేసిన 33 కేవీ విద్యుత్ తీగలు, స్తంభాల వద్ద వివిధ రకాల చెట్లు పెరగడం, విద్యుత్ స్తంభాలను, విద్యుత్ వైర్లను చెట్ల కొమ్మలు, తీగలు అల్లుకోవడంతో తరుచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు, ప్రమాదాల నివారణ కోసం విద్యుత్ అధికారులు చెట్ల కొమ్మలను, తీగలను తొలగించే కార్యక్రమాన్ని ఏడీఈ గోవిందు ఆధ్వర్యంలో విద్యుత్ ఏఈలు, లైన్‌మెన్‌లు, జూనియర్ లైన్ మెన్‌లు చేపట్టారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చెట్లకొమ్మలను తొలగించినట్లు విద్యుత్ ఏడీఈ గోవిందు తెలిపారు. కార్యక్రమంలో గట్టు జూనియర్ లైన్‌మెన్‌లు రాజునాయక్, వీరేష్, ఎం.రాజు తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అభ్యాసన ఉన్నత పాఠశాలలో 2006–07బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు కలిసి వారివారి యోగక్షేమాలు, ప్రస్తుత పరిస్థితులను చర్చించుకున్నారు. గతంలోని విద్యాభ్యాసం, ప్రస్తుత విద్యాభ్యాసంలో సమూల మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. అప్పటి ఉపాధ్యాయులను సమ్మేళనంలో ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు సహాయ సహకారం అందజేస్తామన్నారు. ఉపాధ్యాయులు చూపిన మార్గంలో వివిధ రంగాల్లో స్థిరపడినట్లు తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు కృష్ణయ్య, విజయప్రభ, బీసీరెడ్డి, ఉషారాణి, పూర్వ విద్యార్థులు శ్రీకాంత్, ఆంజనేయులు, వెంకటేష్, రేణుక ఉన్నారు.

కూడలిలో పారిశుద్ధ్య పనులు


అలంపూర్ చౌరస్తాలో డోజర్ సహాయంతో పారిశుద్ధ్య పనులు

అలంపూర్: అలంపూర్ చౌరస్తాలోని నాలుగు రోడ్ల కూడలిలో మంగళవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. అలంపూర్ చౌరస్తాలోని ప్రధాన కూడలిలో రోడ్డు మార్గంలో ఇరు పక్కల వర్షపు నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. డ్రైయినేజీలు సరిగ్గా లేకపోవడంతో కురిసిన వర్షపునీరు దుకాణాల ముందు రోడ్లపైనే నిలవడంతో దుకాణదారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నెల 20న ఉండవెల్లి ఎంపీడీఓ అబ్దుల్ జబ్బార్ పరిశీలించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ రెడ్డికి సూచించారు. దీంతో పంచాయతీ కార్యదర్శి రోడ్డు పక్కన నిలిచిన వర్షపు నీటిని డోజర్ సహాయంతో తొలగించే పనులు చేపట్టారు. దీంతో పదిరోజులుగా రోడ్లపై నిలిచిన వర్షపు నీరు తొలగిపోయింది.

కనులపండువగా ఈదమ్మ జాతర


చిన్నారుల కోలాటాల ప్రదర్శన


డప్పుల దరువుతో యువకుల సందడి

ఉండవెల్లి: మండల కేంద్రంలో ఈదమ్మ జాతర సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే అమ్మవారి ఆలయంలో విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం చిన్నారులు వేసిన కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యువకులు కోలాహలంతో అమ్మవారి ముందు చిందులు, నృత్యాలు వేస్తూ సరదాగా గడిపారు. అమ్మవారి ప్రతిమలను, విగ్రహాలను రంగురంగులతో ముస్తాబు చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఈదురు గాలులతో వర్షం

- రోడ్లపై చెట్లు పడడంతో రాకపోకలకు అంతరాయం
- బోయలగూడెంలో పిడుగు పడి ఎద్దు మృతి


గద్వాల-ఎర్రవల్లి ప్రధాన రహదారి అనంతపురం వద్ద రోడ్డుపై నేలకొరిగిన చెట్టు


ఉదండాపురంలో విరిగిపడిన వేప చెట్టు


పిడుగు పాటుకు మృత్యువాత పడిన ఎద్దు

గద్వాల రూరల్: అకస్మత్తుగా వీచిన గాలికి గద్వాల పట్టణం, మండల పరిధిలో పలుచోట్ల చెట్లు విరిగి పడ్డాయి. గద్వాల–ఎర్రవల్లి ప్రధాన రహదారిపై అనంతపురం గ్రామ సమీపంలో పెట్రోల్ బంకు వద్ద చెట్లు విరిగిపడడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. గద్వాల పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గాలుల తాకిడికి భారీ వృక్షం నేలకొరిగింది. ఆ సయమంలో అక్కడ ఎవరు లేకపోవడంతో ఎలాంటి నష్టం వాటిల్లలేదు.

ఎర్రవల్లిచౌరస్తా: ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఆయా గ్రామాల్లో ఈదురు గాలుల బీభత్సానికి చెట్ల కొమ్మలు విరిగిపడటంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఉదండాపురం గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయం ముందు ఉన్న వేప చెట్టు విరిగి ఆలయంపై పడింది. తెలంగాణ క్రీడా ప్రాంగణం దగ్గర కరెంట్ పోల్స్ నేలకొరిగింది. ఎక్కడ కూడా ఎలాంటి ప్రాణ నష్టం జరగక పోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

గట్టు: మండలంలోని బోయలగూడెంలో మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. రైతు రంగస్వామికి చెందిన ఎద్దులు వ్యవసాయ పొలం దగ్గర ఉండగా పిడుగు పడడంతో ఎద్దు మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు లక్షకు పైగా ఉంటదని రైతు పేర్కొన్నాడు. ఈదురు గాలులకు గ్రామంలోని రోడ్డు పక్కన ఉన్న పెద్ద వేపచెట్టు నేలకొరిగింది. ఆ సమయంలో చెట్టు దగ్గర ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు.

అద్దె భవనాల్లో అంగన్‌వాడీలు

- కనీస వసతుల్లేక గర్భిణులు, బాలింతల అవస్థలు
- పట్టించుకోని అధికారులు


మల్దకల్‌లో అద్దె భవనంలో అంగన్‌వాడీ కేంద్రం

మల్దకల్: అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడంతో పాటు మౌలిక వసతులు లేకపోవడంతో అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. స్త్రీ శిశుసంక్షేమ శాఖలో అంగన్‌వాడీ కేంద్రాలది కీలక పాత్ర, చిన్నారులకు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించే ఈ కేంద్రాలు మౌలిక సదుపాలయాల లేమీతో అవస్థలు పడుతున్నా రు. అంగన్‌వాడీ కేంద్రాలకు అద్దె భవనాలలో అవస్థలు పడుతున్నారు. అద్దె భవనాలు కొన్ని సమస్యల వలయంలో కొట్టిమిట్టాడుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలకు మంచి నీరు, మరుగుదొడ్లు వంటి సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో మరుగుదొడ్లు ఉన్న అవి శిథిలావస్థకు చేరాయి. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని అయా గ్రామాల ప్రజ లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంగన్‌వాడీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు వాటి ఆవరణలో పెరటి తోటలు సాగుచేసి వాటి ద్వారా గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని ఉన్నతాధికారులు ఆదేశించినా అది అమలు కావడం లేదు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మల్దకల్ మండలంలో మొత్తం 59 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 3 మినీ అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వాటిలో 30 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఉండగా, మిగతావి గ్రామ పంచాయతీ, సామాజిక కమ్యూనిటీ భవనాలలో కొనసాగుతున్నాయి. వాటిలో మొత్తం 2793మంది చిన్నారులు ఉండగా, 759 మంది గర్భిణులు, బాలింతలు ఉన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించి మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

సొంత భవనం ఏర్పాటు చేయాలి



గ్రామంలో ఆరు అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వాటిలో 2వ అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేక అద్దె భవనంలో విధులు నిర్వహిస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. సొంత భవనం నిర్మించి సమస్యను పరిష్కరించాలి.

– సుస్మిత, మల్దకల్

అద్దె భవనంలో సరైన వసతులు లేవు



అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేదు. అద్దె భవనాలలో సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నాం. కేంద్రానికి వచ్చే గర్భిణులు, బాలింతలకు మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదు.

– పుష్పలత, అంగన్‌వాడీ టీచరు, మల్దకల్

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం



అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలు పరిశీలించి నివేదిక ద్వారా ప్రభుత్వానికి అందజేస్తాం. నిధులు మంజూరైన వెంటనే చర్యలు తీసుకుంటాం. సొంత భవనాలు లేని అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేశాం. మౌలిక వసతులు లేని అంగన్‌వాడీ కేంద్రాలకు అన్ని వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం.

– కమలాదేవి, సీడీపీఓ